వైసీపీ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్వహణను గాలికొదిలేశారు. ప్రాజెక్టుల నిర్మాణాలను అటకెక్కించారు. కాలువల లైనింగ్ దెబ్బతింది. పంట చేలకు సాగునీరు అందించే పంట కాలువలు అధ్వానంగా మారాయి. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రావడం.. తొమ్మిదేళ్ల తరువాత సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడంతో కాలువల నిర్వహణ, ప్రాజెక్టుల నిర్మాణాలపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మార్చి 3న రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ 2025-26 సంపూర్ణ బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. ఈ మేరకు ఇప్పటికే శాఖలవారీగా బడ్జెట్ కేటాయింపులపై కసరత్తు చేస్తున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వివిధ ప్రాజెక్టులు, కాల్వల నిర్వహణ కోసం రూ.924 కోట్లు, హంద్రీనీవా, గాలేరు-నగరి, ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టుకు మరో రూ.2,340 కోట్లు నిధులు కావాలని జలవన రుల శాఖ ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. కరువు.. వలసల నివారణే లక్ష్యంగా చేపట్టిన వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ ప్రాజెక్టుల నిర్మాణం ప్రశ్నార్థకమేనా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అరకొర నిధులు కోరడమే ఇందుకు ప్రధాన కారణం. బడ్జెట్ ప్రతిపాదన వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

అసంపూర్తిగా గాజులదిన్నె జలాశయం సామర్థ్యం పెంపు పనులు



నిధులు.. నీరు..!



కర్నూలు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాలకు సాగు, తాగునీరు అందించే హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు-నగరి, తెలుగుగంగ.. వంటి ప్రాజెక్టులకు సాగు, తాగునీరు కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచే మళ్లించాలి. జలవనరుల హబ్‌గా పేరుగాంచిన ఉమ్మడి కర్నూలు జిల్లాలో వివిధ ప్రాజెక్టులు నిర్వహణను గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో గాలికొదిలేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో భారీ, మధ్యతరహా, చిన్నతరహా ప్రాజెక్టు పరిధిలో దాదాపుగా 9.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. జలాశయాల నుంచి పొలాలకు సాగునీరు చేరాలంటే కాల్వలు ఎంతో కీలకం.. ఆ కాలువలు రైతన్నల జీవనాడులు. కేసీ కాలువ, గాజులదిన్నె ప్రాజెక్టు, తుంగభద్ర దిగువ కాలువ, గురురాఘవేంద్ర ప్రాజెక్టు, తెలుగుగంగ కాలువ, సిద్ధాపురం ఎత్తిపోతల పథకం, ఎస్ఆర్‌బీసీ.. వంటి నీటివరులు గత వైసీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. జూన్ 12న సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరాక కాలువ నిర్వహణపై దృష్టి సారించారు. తక్షణ మరమ్మతులకు అవసరమైన నిధులు ఇచ్చారు. ఈ నెల 24 నుంచి 2025-26 బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శాఖల వారీగా బడ్జెట్ కేటాయింపులపై కసరత్తు చేస్తున్నారు. రాయలసీమ జిల్లా నుంచి ఏ ప్రాజెక్టుకు ఎంత నిధులు కావాల్సి ఉందో ప్రతిపాదనలు కోరారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా సహా హంద్రీనీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులకు మరో 2,340 కోట్లు ఇవ్వాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఫైనాన్స్ మినిస్టర్ పయ్యావుల కేశవ్ కరువు జిల్లాపై ఏ మేరకు కరుణ చూపుతారో వేచి చూడాలి.

- సాగునీటి వనరుల నిర్వహణ గాలికొదిలేసిన జగన్
- అధ్వానంగా కాలువలు.. దెబ్బతిన్న లైనింగ్
- టీడీపీ కూటమి రాకతో రైతుల్లో ఆశలు
- మార్చి 3న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న ఆర్థిక మంత్రి పయ్యావుల
- ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు రూ.924 కోట్లు అవసరం
- హంద్రీనీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులకు రూ.2,340 కోట్లు
- ప్రతిపాదనలు పంపిన జలవనరుల ఇంజనీర్లు
- వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ ఈ బడ్జెట్‌లో లేనట్లేనా..?



కేసీ కాలువ దుస్థితి

రూ.924 కోట్ల నిధులు ఇవ్వండి

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వివిధ ప్రాజెక్టు కింద సుమారు 9.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందాల్సి ఉంది. ప్రాజెక్టులు, కాలువలు నిర్వహణ, సిబ్బంది జీతాలు, విద్యుత్ బిల్లులు, ఇతర నిర్వహణ ఖర్చులు సహా కొత్త ప్రాజెక్టుల నిర్మాణాలకు రూ.924 కోట్లు నిధులు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. వాస్తవంగా రూ.1,200 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. ఈఎన్‌సీ నుంచి వచ్చిన సూచనల మేరకు రూ.924 కోట్లకు తగ్గించారు. అందులో ఇంజనీర్లు, సిబ్బంది జీతాలు, విద్యుత్ బిల్లులు, ఇతర ఖర్చులకే రూ.250 కోట్లు అవసరం ఉంది. రూ.674 కోట్లు మాత్రమే కాలువలు, ప్రాజెక్టు నిర్వహణ కోసం అడిగారు. శ్రీశైలం ప్రాజెక్టుకు రూ.55 కోట్లు, టీబీపీ ఎల్లెల్సీ, వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ హెడ్ ఆఫ్ అకౌంట్ కింద రూ.250 కోట్లు, కేసీ కెనాల్, కుందూ నది విస్తరణ హెడ్ ఆఫ్ అకౌంట్ కింద కోసం రూ.180 కోట్లు అడిగారు. రాజోలి, జొలదరాశి ప్రాజెక్టులకు రూ.40 కోట్లు, ఎస్సార్బీసీ కాలువకు రూ.40 కోట్లు, గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు రూ.30 కోట్లు, గాజులదిన్నె ప్రాజెక్టుకు రూ.28 కోట్లు, హంద్రీనీవా కాలువ నుంచి 68 చెరువులకు నీటిని ఎత్తిపోసే పథకానికి రూ.40 కోట్లు.. ఇలా ప్రాజెక్టుల వారీగా అవసరమైన మేరకు నిధుల కేటాయింపులు చేయాలని నివేదికలు పంపారు.

మిగతా 7వ పేజీలో



గురురాఘవేంద్ర ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మాధవరం ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్

స్వచ్ఛ దివస్‌లో భాగస్వాములు కండి

● స్వచ్ఛాంధ్రలో విద్యార్థులదే కీలక పాత్ర ● మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్



ప్రమాణం చేస్తున్న మంత్రి తదితరులు

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సమాజ ఆరోగ్యం కోసం చేపట్టిన బృహత్తర పథకం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో ప్రజలు, విద్యార్థులు భాగస్వాముల కావాలని న్యాయ మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మున్సిపల్ కమిషర్ నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ షాదీఖానాలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం జరిగింది. మంత్రి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. వైసీపీ ప్రభుత్వం చెత్తపై కూడా పన్ను వేసి కట్టని వారిని ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు. కూటమి అధికారంలోకి రాగానే చెత్త పన్ను రద్దు చేయటంతోపాటు నెలకు ఒక రోజు ప్రభుత్వమే స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో చేపట్టిందన్నారు. కమిషనర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛాంధ్రలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని కోరారు. ప్రతి విద్యార్థి తన చదివే పాఠశాలతో పాటు తన తల్లిదండ్రులను ప్రతిష్మాత్మక స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వాములను చేయగలిగితే పరిసరాలు ఆరోగ్యకరంగా మారుతాయన్నారు. ఈ సందర్భంగా మంత్రి తదీతరులు చెత్త రహిత సమాజానికి బద్ధులమవుదామంటూ కార్యక్రమంలో పాల్గొన్న వారితో ప్రమాణం చేయించారు. కౌన్సిలర్లు పురందర్, నాగార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ రెడ్డి మహిళా సంఘాల ప్రతినిధులు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛతే లక్ష్యంగా పని చేయాలి

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంతో స్వచ్ఛతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ రాజకుమారి గనియా పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్ఓ రాము నాయక్‌తోపాటు కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్, కార్యాలయంలోని సెక్షన్ల గదులను శుభ్రం చేశారు. స్వచ్ఛ జిల్లాగా రూపొందించడంలో ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.



కలెక్టరేట్ ఆవరణలో చెత్తను తొలగిస్తున్న కలెక్టర్ రాజకుమారి

మార్చి 3 నుంచి అహోబిలం బ్రహ్మోత్సవాలు

11న ఎగువ, 12న దిగువన కల్యాణోత్సవం



ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహోత్సవాలు మార్చి 3 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మఠం నిర్వాహకులు శనివారం వెల్లడించారు. అహోబిలేశుడు పార్వేట ముగించుకుని ఫిబ్రవరి 28న అహోబిలం క్షేత్రానికి చేరుకుంటారు. అనంతరం అహోబిలం మఠం 46వ పీఠాధిపతి పర్యవేక్షణలో ఫాల్గుణ శుద్ధ పంచమి నుంచి పౌర్ణమి వరకు బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో 4వ తేదీన అంకురార్పణ, 5న ధ్వజారోహణం, 11న ఉదయం తిరుమంజనం, రాత్రి జ్వాలా నరసింహస్వామి, చెంచులక్ష్మీ అమ్మవారి ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవం, 13న రథోత్సవం, 14న గరుడోత్సవం నిర్వహించనున్నారు. అలాగే దిగువ అహోబిలంలో 5న అంకురార్పణ, 6న ధ్వజారోహణం, 12వ తేదీ రాత్రి ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవారి ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవం, 14న రథోత్సవం, 15న గరుడోత్సవం నిర్వహించనున్నారు. అదేవిధంగా ప్రతి రోజూ స్వామివారు ఓ ప్రత్యేక వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. బ్రహ్మోత్సవాల అనంతరం 16 నుంచి 18వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం ప్రహ్లాదవరదస్వామి తెప్పోత్సవ కార్యక్రమాలు జరుగుతాయి.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 122 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో 122 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈవో సునీత తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు నిర్వహించిన పరీక్షల్లో 1934 మంది విద్యార్థులకుగాను 184 మంది హాజరయ్యారని, 94మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి 5గంటల వరకు నిర్వహించిన పరీక్షల్లో 1317 మంది విద్యార్థులకు గాను 1289 మంది విద్యార్థులు హాజరుకాగా 28 మంది గైర్హాజరయ్యారని వివరించారు. పరీక్షలను సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించామన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌లను మినహా పరీక్షా కేంద్రాల్లోకి ఎవరికీ అనుమతి లేదన్నారు.

అవిశ్వాసం అనివార్యమేనా?

ఆత్మకూరు కమిషనర్‌ను కలిసిన కౌన్సిలర్లు



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న వైసీపీ కౌన్సిలర్లు

ఆత్మకూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియాపై అవిశ్వాస తీర్మానానికి కౌన్సిలర్లు సమాయాత్తమవుతున్నారు. గత నెల రోజులుగా పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. ఈ క్రమంలో శనివారం కౌన్సిలర్లు దూకుడు ప్రదర్శించారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు వద్దకు వెళ్లి అవిశ్వాస తీర్మాన ప్రక్రియ గురించి చర్చించారు. నెల రోజుల ముందుగానే తీర్మానం చేస్తామని కౌన్సిలర్లు ప్రస్తావించారు. అయితే మార్చి 20వ తేదీకి కార్యవర్గానికి నాలుగు సంవత్సరాలు పూర్తవుతాయని, ఆ తర్వాతే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ వివరించారు. ఈ విషయంపై తాము పూర్తి పరిశీలన చేసి నిర్ణయం తీసుకుంటామని కౌన్సిలర్లు వెల్లడించారు. ఇదిలావుంటే ఇద్దరు మున్సిపల్ కార్మికులను అకారణంగా పక్కన పెట్టడంపై కౌన్సిలర్లు కమిషనర్‌ను ప్రశ్నించారు. కేవలం రాజకీయ ఉద్దేశంతోనే కార్మికులను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన కమిషనర్ శనివారం మధ్యాహ్నం నుంచి ఆ కార్మికులను విధుల్లోకి అనుమతించారు.

కృష్ణా బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి: బొజ్జా

నంద్యాల మున్సిపాలిటీ ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో సంఘం సభ్యులు శనివారం స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఫరూక్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు కృష్ణా నది బోర్డు ఆవశ్యకత గురించి మంత్రికి వివరించారు. మంత్రిని కలిసిన వారిలో సమితి ఉపాధ్యక్షులు, వైయస్ రెడ్డి, బాలీశ్వర రెడ్డి, ఎన్. సుధాకర్ రావు, శ్రీహరి తదీతరులు ఉన్నారు.



మంత్రితో మాట్లాడుతున్న దశరథరామిరెడ్డి

పాఠశాలల బలోపేతానికి కృషి చేద్దాం

జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల బలోపేతానికి కృషి చేద్దామని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి కోరారు. శనివారం నంద్యాల మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చాపిరేవుల కాంప్లెక్స్ సమావేశం క్లస్టర్ పరిధిలో నిర్వహించారు. సమీప పాఠశాలలకు చెందిన 62 మంది ఉపాధ్యాయులకు గాను 59 హాజరయ్యారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో విద్యార్థుల ప్రగతి సాధించడానికి నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఆంగ్లంలో పట్టు సాధించడం ఎలా అన్న విషయాలపై డీఈవో చర్చించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులతో మమేకమై కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో ప్రధానంగా సి, డి గ్రేడ్ విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు మరింత చైతన్య వంతమైన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల చేరిక మరింత పెంచాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో అడిషనల్ కోఆర్డినేటర్ శ్రీప్రేమంతకుమార్, జిల్లా సెక్టోరియల్ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఎంఈవో-2 శివరాంతో కలిసి మొక్కలు నాటారు.



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

● **నంద్యాల ఎడ్యుకేషన్:** జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాల క్రాంతి నగర్‌లోని మోడల్‌స్కూల్‌లో జిల్లా విద్యాశాఖాధికారి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ లీలావతిదేవి, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతారావునాయక్ పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్ విజయవంతం చేయండి

ఆత్మకూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మార్చి 8వ తేదీన జరిగే జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆత్మకూరు సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక కోర్టు హాల్‌లో పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులతో పాటు న్యాయవాదులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూమార్చి 8 తేదీన జరగబోవు జాతీయ లోక్‌అదాలత్‌లో వీలైనంత వరకు రాజీ చేయదగ్గ కేసులను పరిష్కరించాలని సూచించారు. ప్రత్యేకించి క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులు, మున్సిపల్ ప్రాపర్టీ టాక్స్, బిల్డింగ్ ప్లాన్స్, కుటుంబ తగాదాలు, 10లీటర్లలోపు నాటుసారా కేసులు తదితర కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చునని అన్నారు. కక్షిదారులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని తెలిపారు.

తుంగభద్ర
సాహిత్యం



కొత్త పుస్తకం

- మినీ కథల సంకలనం
- నేడు నరసం రాష్ట్ర ఏడో వార్షికోత్సవంలో ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కథ.. సంస్కృతిలో అంతర్భాగం. తెలుగు కథ జానపద, లిఖిత రూపంలో పిల్లల్ని, పెద్దలను కూడా ఆకట్టుకుంటుంది. ఊహాశక్తిని ప్రేరేపిస్తూ, పాఠకుల మనసులపై శాశ్వత ప్రభావాన్ని కథ చూపిస్తుంది. సామాజిక వాస్తవికతను, జీవన సంఘర్షణను, మానవ అనుభవాల గాఢతను ఎత్తి చూపించడంలో కథా ప్రక్రియ పాత్ర గణనీయం. మానవాళి అనుభవ సంపదను తరతరాలుగా కొనసాగించే అపురూప కళా రూపం కథ. మనిషి ఎదుగుదలలో కథలకు ఎనలేని ప్రాధాన్యత ఉన్నది. ముద్రణ రంగం పెరిగాక పత్రికలు, పుస్తకాల రూపంలో అశేష పాఠకులకు కథలు చేరువగా వచ్చేశాయి. వందలాదిగా కథకుల తమ కథలతో వినతికెక్కారు. అనేక మంది రచయితలు పాఠకులపై చెరగని ముద్ర వేశారు. మొత్తం మీద సాహిత్యంలో, మానవ జీవితంలో కథా ప్రాభవం వెలకట్టలేనిది. అలా తెలుగులో తొలి కథను బండారు అచ్చమాంబ రాశారు. అయినా గురజాడ రాసిన 'దిద్దుబాటు' తొలికథగా సాహిత్య ప్రపంచంలో నిలిచిపోయింది. నేటి తరానికి వస్తే...కర్నూలుకు చెందిన ప్రముఖ రచయిత్రులు చెక్కిలం విజయలక్ష్మి, తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం వంటి వారి స్ఫూర్తితో కర్నూలులోనే గత ఏడేళ్ల క్రితం 'నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) ఆవిర్భవించింది. నరసంలో రాష్ట్రంలోని అనేకమంది రచయిత్రులు, కవయిత్రులు ఉన్నారు. కర్నూలు కవయిత్రులు ఇందులో ఉన్నారు. వీరు కథలు, కథానికలు, నవలలు, కవిత్వం విరివిగా రాస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నరసం ఏడో వార్షికోత్సవానికి 31 మంది రచయిత్రులు రాసిన 31 కథల సంకలనం 'నరసం కర్నూలు కథలు' శీర్షికతో మినీ కథలు పాఠకుల ముందుకు వచ్చాయి. అతి తక్కువ సమయంలోనే రచయిత్రులు స్ఫూర్తిదాయకమైన కథలు రాశారు. ఈ సంకలనం తీసుకురావాలన్న సంకల్పం నరసం జిల్లా ప్రధాన కారదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీదేవిది కాగా, నరసం జిల్లా అధ్యక్షురాలు కా.వెం. సుబ్బలక్ష్మమ్మ ఇందుకు ప్రోత్సాహం ఇచ్చారు. కథాంశం ఐచ్ఛికం అని ప్రకటించడంతో, ఈ కథలలో కేవలం స్త్రీలకు సంబంధించిన అంశాలే కాకుండా వివిధ అంశాలు చోటు చేసుకున్నాయి. అయితే సంక్షిప్తత లక్ష్యంగా రాసిన కథలివి.

● విభిన్న కోణాలను స్పృజించిన రచయిత్రులు...

ఈ కథల సంపుటిలో రచయిత్రులు విభిన్న కోణాలను స్పృజిస్తూ కథలు రాశారు. సంసారంలో తలెత్తే సంక్షోభాలు, పితృస్వామ్య భావజాలం, ఆడపిల్లలకు విధించే ఆంక్షలు, సంకుచిత మనస్తత్వం, అహంకారంతో పెత్తనం చెలాయించే భర్తల అరాచకాలు, ఆంగ్ల మాధ్యమాల మోజులో మన సంస్కృతికి దూరమవుతున్న బాలలు, కర్మసిద్ధాంతాలు, ఆడపిల్లలకు పై చదువులకు ఎదురయ్యే ఆటంకాలు, స్త్రీ వివక్షత, అస్తిత్వం కోసం స్త్రీలు చేసే పోరాటాలు వంటివే కాకుండా, స్త్రీల ఆశయాలు, ఆకాంక్షలు, ఆధ్యాత్మిక అనుభూతులు, నైతికత, హాస్యం ఇలా అనేక అంశాలు ఇతివృత్తాలుగా వెలువడిన కథా కదంబమే ఈ పుస్తక సంకలనం.

● ఓనమాల స్థాయి నుంచి చేయి తిరిగిన రచయిత్రుల దాకా

ఈ సంకలనంలో ఇప్పుడిప్పుడే ఓనమాలు దిద్దుతున్న రచయిత్రుల మొదలు, చేయి తిరిగిన రచయిత్రుల కథలు ఉన్నాయి. నరసం తీసుకువచ్చిన ఈ తొలి సంకలనంలో, బుడిబుడి నడకలు వేస్తున్న రచయిత్రులు భవిష్యత్తులో ఉరకలేస్తూ పరుగులు తీసే స్థాయికి చేరవచ్చని నిశ్చయంగా చెప్పవచ్చు. ఈ ప్రయత్నాన్ని ఆహ్వానిస్తూ నరసం వ్యవస్థాపక అధ్యక్షురాలు తేళ్ల అరుణ అభినందనలు తెలుపగా, ప్రఖ్యాత బాలల కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ నూతన కథకులకు దిశానిర్దేశం చేస్తూ, విలువైన సూచనలతో చక్కని సమీక్షను రాశారు. ఈ పుస్తకం అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాలల్లో అందుబాటులోకి రానుంది.



\- డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, కర్నూలు

మధురిమలు



మాఘ మాసం వచ్చొంది
శీతాకాలం.. ఎండా కాలం..
రెంటినీ కలగలుపుకొని
మల్లెల గుభాళింపులు

గుండెల్లో కలవరింతలు
మాఘం రసికుడికి భోగం
మల్లెల మహత్మ్యం

మల్లెల ఘుమఘుమలు
మాఘమాసం మధురిమలు

-సంగిపోగు ఆనంద్ రాజు, 9000280006



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించ కుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

నగరంలో నేడు

- నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఉదయం 10 గంటలకు నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నారు. సాయంత్రం 7 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచీ రచయిత్రులు, కవయిత్రులు పాల్గొనే ఈ సభలో పుస్తక ప్రదర్శనలు, పుస్తక ఆవిష్కరణలు, కవి సమ్మేళనాలు నిర్వహిస్తారు.
- నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో ఉదయం 10 గంటలకు తైక్వాండో క్రీడా బెల్టుల ప్రదానోత్సవం ఏర్పాటు చేసినట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి టి. వెంకటేశ్వర్లు తెలిపారు.
- నగరంలోని ఎ.క్యాంపు 'కుడా' కార్యాలయ ఆవరణలో సాయంత్రం 6.30 గంటలకు 'టేస్ట్ ఆఫ్ మదర్స్ లవ్' పేరుతో మహిళలకు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు.

ఆకాశవాణిలో కిసాన్ దినోత్సవం



ప్రసంగిస్తున్న డైరెక్టర్ మురళి

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని బళ్లారి రోడ్డులోగల కర్నూలు ఆకాశవాణి కేంద్రంలో శనివారం రేడియో కిసాన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా కర్నూలు కేంద్రంలో ఏర్పాటు చేసిన కిసాన్ దినోత్సవానికి ఆకాశవాణి కర్నూలు కేంద్ర డైరెక్టర్ దేవరభొట్ల మురళి సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకాశవాణి కిసాన్‌వాణి కార్యక్రమాలకు వ్యవసాయ పరిశోధన సంస్థలు, వ్యవసాయ శాఖ, పశుసంవర్థక శాఖ, మత్స్యశాఖల సహకారం విశేషంగా అందుతోందని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీ రైతు సాధికార సంస్థ కమ్యూనిటీ మేనేజర్, న్యాచురల్ ఫార్మింగ్ చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ అధికారి లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ రైతులకు ఆధునిక వ్యవసాయ సమాచారం చేరవేయడంలో ఆకాశవాణి పాత్ర గణనీయమని అన్నారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ డాక్టర్ ఎం. జాన్సన్ మాట్లాడుతూ వ్యవసాయ పరిశోధన ఫలితాలు రైతులకు చేరవేయడంలో రేడియో కేంద్రాలు వారధిగా నిలుస్తున్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుజాతమ్మ, వ్యవసాయ శాఖ ఏడీ అరుణకుమారి మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలు రైతులకు చేరవేయడం ద్వారా ఆకాశవాణి రైతుల జీవితంలో భాగమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి వ్యవసాయ విభాగం కార్యక్రమ అధికారి జి. చంద్రశేఖర్ ప్రసంగించారు.

ఆమె చదువు



చాగలమర్రిలో మహిళల విద్యాభ్యాసం

- పాఠశాలకు వెళ్లని మహిళల జీవితంలో అక్షర వెలుగు
- స్త్రీల వికసానికి ఉల్లాస్
- ప్రారంభమైన బోధనా తరగతులు
- చదువు, దైనందిన విషయాలపై అవగాహన

తరుణి THARUNI

చాగలమర్రి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు.. అనే నినాదం ఇప్పుడు చాలా పాతపడిపోయిందిగాని, స్త్రీలు చదువు సమాజపు సాంస్కృతిక ఉన్నతికి గీటురాయి. జనాభాలో సగం మందిని చదువుకు దూరం చేసిన పరిస్థితులను అధిగమించి బాలికా విద్య ఇప్పుడు సర్వామోదం పొందింది. అయితే ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో మహిళల అక్షరాస్యత తక్కువే. ఈ నేపథ్యంలో నిరక్షరాస్యులైన మహిళలకు చదవడం, రాయడంతో పాటు డిజిటల్ లావాదేవిలు నిర్వహించేలా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ)అనే పేరుతో వయోజన విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మారుతున్న కాలానికి అనుగుణంగా వీరందరినీ అక్షరాస్యులను చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం దీని ప్రధాన లక్ష్యం. ఈ పథకం కింద ప్రాథమిక విద్యకు నోచుకోని వారిని, మధ్యలోనే బడి మానేసి అక్షరాలను మర్చిపోయిన వారిని గ్రామస్థాయిలో గుర్తించారు. ఇందుకు కార్యాచరణ రూపకల్పన చేసి క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నారు.

విద్యావంతులకు శిక్షణ

ఎలాంటి లాభాపేక్ష లేకుండా స్వచ్ఛందంగా చదువు చెప్పడానికి పొదుపు సంఘాల్లో ఆసక్తి ఉన్న మహిళలను గుర్తించి వారికి ఇప్పటికే మండలస్థాయిలో శిక్షణ ఇచ్చారు. పాఠ్యాంశ సామగ్రిని అందజేశారు. ప్రతి గ్రామంలో పొదుపు సంఘాల్లో నిరక్షరాస్యులైన 10 మంది సభ్యులకు ఒక వలంటీర్ అక్షరాలతో పాటు సంతకాలు చేయడం నేర్పిస్తారు. వర్ణమాల, లెక్కలు కట్టడం, బ్యాంకు లావాదేవిల నిర్వహణ వంటి పలు అంశాలతో పాటు డిజిటల్ చెల్లింపులు, మొబైల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ చెల్లింపులు తదితర అక్షరాస్యతపైన పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకు గ్రామాల్లో వెసులుబాటు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు అందరికీ ఆమోదయోగ్యమైన ప్రదేశాల్లో ప్రత్యేక తరగతులకు సిద్ధం చేశారు.




సంక్షిప్త వాచకాన్ని విడుదల చేస్తున్న అధికారులు

అక్షర వెలుగు నింపుతాం

మహిళలు డిజిటల్ మోసాలకు గురి కాకుండా అవగాహన కల్పిస్తున్నాం. తెలుగుభాష, గణితం నేర్పడంతో పాటు దైనందిన వినియోగానికి సంబంధించిన నైపుణ్యాలను పెంచుతున్నాం. చాగలమర్రి మండలంలో 1,000 మందిని నిరక్షరాస్యులుగా గుర్తించాం. వీరికి 100 మంది వలంటీర్లతో రోజుకు గంటన్నర పాటు బోధన జరిగేలా పర్యవేక్షణ ఉంటుంది. శిక్షణ కాల పరిమితి పూర్తయ్యే నాటికి మహిళల్లో అక్షర వెలుగు నింపుతాం.

-నాగమ్మ, వెలుగు ఏపీఎం, చాగలమర్రి మండలం

నిరక్షరాస్యుల ఎంపిక



అక్షర వెలుగు పుస్తకం

నంద్యాల జిల్లాలో 28 మండలాల్లో 26,784 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యం నిర్ణయించుకున్నారు. ఇందుకు 2,592 కేంద్రాలు, 2,677 మంది వలంటీర్లను నియమించారు. ఆళ్లగడ్డ మండలంలో 650 మంది నిరక్షరాస్యులు, శిరివెళ్లలో 1,125, రుద్రవరం 1,150, చాగలమర్రి 1,000, ఉయ్యాలవాడ 500, దొర్నిపాడు 475 మంది నిరక్షరాస్యులను గుర్తించారు. వీరికి చదువు చెప్పేందుకు వలంటీర్లకు, వీవోఏలకు తగిన శిక్షణ ఇచ్చారు. వీరందరూ ప్రతి రోజు సుమారు రెండు గంటల పాటు నిరక్షరాస్యులకు తరగతులు నిర్వహిస్తారు. బోధనకు జిల్లా వ్యాప్తంగా మార్గదర్శక వాచకం, అక్షర వెలుగు సంక్షిప్త వాచకం, అభ్యాసపు హాజరు పట్టికలు అందించారు. వీటన్నింటినీ మండల కేంద్రాల నుంచి అన్ని గ్రామీణ ప్రాంతాల్లోని వయోజన విద్యా కేంద్రాలకు సరఫరా చేశారు. స్వయం సంఘాల్లో వీవోఏలను వలంటీర్లుగా ఎంపిక చేసి వారి ద్వారా గ్రామాల్లో చదువు చెప్పిస్తున్నారు. జనవరి 27 నుంచి ప్రారంభమైన ఈ శిక్షణా తరగతులు మార్చి నెల 18 నాటికి శిక్షణ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. ఈ ప్రత్యేక శిక్షణా తరగతుల ప్రక్రియపై వివిధ శాఖల అధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. వయోజన విద్య సజావుగా సాగేలా వీరు పర్యవేక్షించనున్నారు.

అలరించిన త్యాగరాజ ఆరాధనోత్సవ నృత్యాలు



త్యాగరాజ ఆరాధనోత్సవంలో అతిథులతో చిన్నారి నృత్య కళాకారులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో శనివారం రాత్రి నిర్వహించిన త్యాగరాజ ఆరాధనోత్సవ నృత్యాలు ఆకట్టుకున్నాయి. నగరంలోని సూర్యకళా కల్చరల్ అకాడమీ, సద్గురు త్యాగరాజ సన్మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వందకు పైగా చిన్నారులు తమ నృత్య రూపకాలతో ఆకట్టుకున్నారు. త్యాగరాజ కీర్తనలకు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాంశాలు ప్రత్యేకంగా నిలిచాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా కార్యక్రమానికి హార్ట్ ఫౌండేషన్ అధ్యక్షుడు, ప్రముఖ గుండె వైద్య నిపుణులు పి.చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, సభాధ్యక్షులుగా టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు విద్వాన్ పత్తి ఓబులయ్య వ్యవహరించారు. సూర్యకళా కల్చరల్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు బైలుపాటి సోమా శంకరయ్య, అధ్యక్షుడు బి. సుధాకర్, కార్యదర్శి గీతాంజలి, లలితాపీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి, సాహితీవేత్త స్వరూప్‌సిన్హా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ హార్ట్ ఫౌండేషన్ ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను శాస్త్రీయ సంగీతం, నృత్యం పట్ల ఆసక్తి పెంచేలా ప్రోత్సహించాలని సూచించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ సంగీతమూర్తి త్రయంగా పేర్కొనే త్యాగరాజు, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు ముగ్గురిలో మొదటి ఇద్దరికీ కర్నూలు జిల్లాతో అనుబంధం ఉందన్నారు. వారి పూర్వీకులు ఈ జిల్లాకు చెందినవారేనని గుర్తు చేశారు. ఈ సందర్భంగా గీతాంజలి బృందం అనేక త్యాగరాజ కీర్తనలు ఆలపించారు.

జిల్లా కోర్టులో స్వచ్ఛ భారత్



మొక్కలు నాటుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి, న్యాయాధికారులు

కర్నూలు లీగల్/ కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జిల్లా కోర్టు సంయుక్తంగా శనివారం కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ పీవీ కిషోర్ రెడ్డి, జి.భూపాల్‌రెడ్డి, పి.పాండురంగారెడ్డి, టి.జ్యోత్స్నాదేవి, జి.అపర్ణ, జి.వందన, కల్యాణి, సరోజనమ్మ తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'మూలం-వనరు' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎన్విరానిమెంటల్ ఇంజనీర్ శంకర్‌నాయక్, సైంటిస్టు వీరేంద్ర కుమార్, ఇంజనీర్ పీవీ కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అవగాహన కల్పించారు. ఏపీపీసీబీ జోనల్ ఆఫీస్ కమ్ లేబొరేటరీ అండ్ రీజినల్ బిల్డింగ్ కర్నూలులో పాల్గొన్న వారితో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే మెడికవర్, కిమ్స్ ఆసుపత్రుల్లో కూడా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్.వీరేంద్ర కుమార్ మాట్లాడుతూ మూల స్థాయిలోనే మున్సిపల్ ఘన వ్యర్థాలను వేరు చేయడం ద్వారా పర్యావరణాన్ని సురక్షితంగా మారుస్తుందని పేర్కొన్నారు.

అక్కే అమ్మగా..!

- తల్లిదండ్రులు వలసబాట..
- తాను చదువుకుంటూ.. తమ్ముడిని చదివిస్తూ
- నేటి పిల్లలకు ఆదర్శంగా నిలుస్తున్న విద్యార్థిని బోయ నందిని



తమ్ముడు గౌతమ్‌కు అన్నం తినిపిస్తున్న అక్క నందిని



తమ్ముడు గౌతమ్‌తో కలిసి చదువుకుంటున్న అక్క నందిని

కోసిగి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అక్కనే అమ్మలా తన ఇద్దరి తమ్ముళ్లను చూసుకుంటోంది. తాను చదువుకుంటూ తన ఇద్దరి తమ్ముళ్లను చదువు, బాగోగులు చేసుకుంటోంది. అంతేకాదు ఇంటి పని, వంట పని చేస్తూ అందరికీ ఆదర్శంగా నందిని ఆదర్శంగా నిలుస్తుంది. కోసిగి మండల కేంద్రంలోని 7వ వార్డులో నివాసం ఉంటున్న బోయ బుగేని చిరుతపల్లి హనుమంతు, నాగవేణి దంపతులకు ముగ్గురు సంతానం. వీరిలో నందిని కోసిగిలోని బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. తిరుమల 5వ తరగతి వరకు చదువుకొని ఆ తరువాత బడి మానేసి పనికి వెళ్తున్నాడు. గౌతమ్ మూడో కుమారుడు కోసిగిలోని 1వ తరగతి చదువుతున్నాడు.



వంట పాత్రలు శుభ్రం చేసుకుంటున్న నందిని

అయితే. తల్లిదండ్రులు 15 రోజుల క్రితం కర్ణాటక రాష్ట్రంలో మిర్చి పనుల కోసం వలస వెళ్లారు. వీరితో పాటు ముగ్గురు పిల్లలను కూడా తమతో పాటు రావాలని తల్లిదండ్రులు కోరినా. కూతురు నందిని ఒప్పుకోలేదు. తాము వస్తే చదువు మధ్యలోనే ఆగిపోతుందని తెలిపింది. తాను చదువుకుని, తమ్ముళ్లను చదివించుకుంటూ ఇంటి వద్దనే ఉంటాననీ తల్లిదండ్రులకు నచ్చజెప్పింది. కూతురు మాటలు విన్న తల్లిదండ్రులు కాలనీ ప్రజలతో కలిసి కర్ణాటకకు వలస వెళ్లిపోయారు. తమ్ముళ్ల ఆలన పాలన చూసుకుంటూ.. తాను చదువుకుంటూ వారికి వంటా వార్పు చేసి పెడుతోంది. నందినిని చూసి పక్క ఇంటి వారితో పాటు బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగేశ్వరిదేవి, ఉపాధ్యాయినులు మెచ్చుకుంటున్నారు. తల్లిదండ్రులు లేకున్నా ధైర్యంగా తమ్ముళ్లతో కలిసి ఇంటి పని చేసుకుంటూ పాఠశాలకు సక్రమంగా వెళ్తున్నారని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మా నాన్న గుర్తుకొస్తున్నారు



రోజు మా అమ్మే రెడీ చేసి అన్నం తినిపించి బడికి పంపేది. చాలా రోజుల నుంచి అమ్మానాన్నలు లేరు. మా అక్కే రెడీ చేసి అన్నం తినిపించి నన్ను బడిలో వదిలి తాను బడికి వెళ్తోంది. రాత్రి అమ్మ, నాన్న గుర్తుకు వస్తారు. - గౌతమ్

చదువు కోసమనే వెళ్లలేదు



మా అమ్మానాన్నలతో కలిసి నేను మా తమ్ముళ్లు వలస వెళితే మా చదువు మధ్యలోనే ఆగిపోతుంది. మేము కూడా చదువుకోకపోతే ఇబ్బందులు పడుతాము. బాగా చదువుకుని మంచి ప్రయోజకులుగా స్థిరపడి, నేను మంచి ఉద్యోగం సాధిస్తే మా అమ్మానాన్నల కష్టాలు తీరుతాయి. ఎంత కష్టమైనా సరే వలస వెళ్లకుండా నేను నా తమ్ముళ్లు చదువుకుంటున్నాం. - నందిని

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

● ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



కాల్వబుగ్గలో మహాశివరాత్రి పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ఫెస్టివల్ కమిటీ సభ్యుల సమష్టి కృషితో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు శివునికి ప్రత్యేక పూజలు చేశారు. మహాశివరాత్రి వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఫెస్టివల్ కమిటీ సభ్యులు, అధికారులు ఆవిష్కరించారు. అనంతరం సమీక్ష సమావేశంలో ఆయా శాఖ అధికారులు ఏర్పాట్లపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమీక్ష సమావేశంలో ఈవో మద్దిలేటి అధ్యక్షత వహించారు. 25 నుంచి మార్చి 2వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు మల్లెల జ్యోతి, డీవీవో భాస్కర్, జనసేన నాయకులు సివిల్ సప్లయ్ డైరెక్టర్ మంజునాథ్, సుబ్బయ్య, ఎండోమెంటు అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ సుధారాణి, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎస్ఐ సునీల్ కుమార్, ఈవోఆర్డీ పాల్గొన్నారు.

ఐదేళ్ల తర్వాత భూ సంరక్షణకు నిధులు

● కర్నూలుకు రూ.1.50 కోట్లు.. నంద్యాలకు రూ.1.20 కోట్లు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో గత ఐదేళ్లగా భూసంరక్షణ అటకెక్కింది. దీంతో రైతులు పొలాలు నిస్సారమై పంట ఉత్పత్తులు తగ్గిపోయి నష్టాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం రాగానే మళ్లీ రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈ సంవత్సరం భూసంరక్షణ శాఖకు కర్నూలు జిల్లాకు రూ.1.50 కోట్లు, నంద్యాల జిల్లాకు 1.20 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా భూసంరక్షణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కర్నూలు జిల్లాలో నాలుగు క్లస్టర్లు, నంద్యాల జిల్లాలో నాలుగు క్లస్టర్ల పరిధిలో రైతుల పొలాల్లో భూసంరక్షణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కర్నూలు జిల్లాలోని ఆదోని డివిజన్‌లో ఆదోని, హాలహర్వి, ఆలూరు, చిప్పగిరి మండలాలతో పాటు నంద్యాల జిల్లాలో ప్యాపిలి, డోన్ మండలాల పరిధిలో ఈ పనులు జరుగుతాయన్నారు. ఏప్రిల్ నుంచి రైతులకు సంబంధించిన పొలాల్లో పనులు చేపడతామని స్పష్టం చేశారు. నంద్యాల జిల్లాలో యు. కొత్తపల్లి, ఎర్రగుంట్ల, సంకలాపురం, అంబాపురం గ్రామాల క్లస్టర్లలో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కర్నూలు జిల్లాలో నాలుగు క్లస్టర్లు, కే.మార్కాపురంలో రెండు క్లస్టర్లలో పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఆదోని డివిజన్‌లో బైటిగేరి, బసలదొడ్డి గ్రామాల్లో పనులు చేపట్టనున్నట్లు డీడీ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

లక్ష్యాన్ని చేరుకోండి: డ్వామా పీడీ

ఓర్వకల్లు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పని చేసే వేతనదారుల సంఖ్యను పెంచి లక్ష్యాన్ని చేరుకోవాలని డ్వామా పీడీ వెంకటరమణయ్య అన్నారు. శనివారం మండలంలోని కాల్వ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పని దినాలు కల్పించాలన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా హుశేనాపురం, ఓర్వకల్లు, నన్నూరు, లొద్దిపల్లె తదితర గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు కోర్సు డైరెక్టర్ నాగఎర్రమల, ఏపీవో కుమారసాయినాథ్, సర్పంచులు చంద్రగోవర్ధనమ్మ, వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ చిన్నమ్మ, టీడీపీ నాయకులు గోవిందరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి,చంద్ర పెద్దస్వామి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఈవో, పంచాయతీ కార్యదర్శి మధ్య వాగ్వాదం

సమస్య పోలీసు స్టేషనుకు వెళ్లిన వైనం

రుద్రవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం ఈవో సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరెడ్డి మధ్య శనివారం వాగ్వివాదం చోటు చేసుకుంది. ఇంటి పన్ను, కుళాయి పన్ను వసూలు చేయాలని చెప్పే విషయంలో, జీతాల బిల్లుల్లో పంచాయతీ కార్యదర్శి పేరు లేకుండా చేయడంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. ఇద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగడంతో సచివాలయ సిబ్బంది ఖంగుతిన్నారు. సమస్య పోలీసుస్టేషన వరకు వెళ్లింది. ఈ విషయంపై ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రమణ్యం మాట్లాడుతూ ఈవో, పంచాయతీ కార్యదర్శి మధ్య జరిగిన గొడవ తమ దృష్టికి రాలేదని అన్నారు. సోమవారం విచారిస్తామని చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రుద్రవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ కుమ్మరి నాగేశ్వర్‌రావు (51) మృతి చెందినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం చిన్నకంబలూరు సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో శిరివెళ్ల మండలం బోయిలకుంట్ల గ్రామానికి చెందిన కుమ్మరి నాగేశ్వర్‌రావు తీవ్రంగా గాయపడడంతో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని కుమారుడు కుమ్మరి మస్తాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శిరివెళ్ల గ్రామానికి చెందిన నూర్‌బాషాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

● మండలంలోని బి.నాగిరెడ్డిపల్లెకు చెందిన చౌడమ్మ అనే మహిళ (72) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డి మందు తాగింది. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గూడ్స్ ప్రమాదంలో వృద్ధుడు...

డోన్ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కొత్తబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో రైల్వే ట్రాక్‌పై శనివారం గూడ్స్ రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందినట్లు డోన్ జీఆర్‌పీ ఎస్ఐ బిందుమాధవి తెలిపారు. కోట్లవారి పల్లెకు చెందిన చిన్నన్న (70)కు వినికిడి లోపం ఉంది. రైల్వే ట్రాక్ దాటుతూ గూడ్స్ రైలు వచ్చేది గమనించకపోవడంతో ప్రమాదం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

బనగానపల్లె, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలం యనకండ్ల గ్రామానికి చెందిన బాలుడు అనే వ్యక్తి భార్య శివమ్మ (35) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు శనివారం తెలిపారు. శివమ్మ మృతదేహాన్ని బనగానపల్లె వైద్యశాలకు తరలించారు. కుటుంబ సమస్యల కారణంగానే మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.

హెచ్ఎం సస్పెండ్

పాణ్యం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలమూరు ఎంపీయూపీ పాఠశాల హెచ్ఎం బి. మల్లేశ్వర్‌ను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం పాఠశాలలో బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఎంఈఓ, ఐసీడీఎస్ అధికారులు విచారించి నివేదికలు పంపినట్లు తెలిపారు. ఈ మేరకు బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్ఎంను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అయితే అంతకు ముందు బాలిక కుటుంబ సభ్యులు హెచ్ఎంకు దేహశుద్ధి చేసినట్లు తెలిసింది.

గడ్డివామి దగ్ధం

వెల్దుర్తి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలో బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో శనివారం మధ్యాహ్నం జాతీయ రహదారి పక్కన ఉన్న రైతు గిడ్డయ్య కల్లందొడ్డిలో ఉన్నపలంగా మంటలు వ్యాపించాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖ వారికి సమాచారం అందించారు. మిగతా రైతుల కల్లందొడ్లకు మంటలు వ్యాపించకుండా అగ్నిమాపకశాఖ సిబ్బంది మంటలను అదుపుచేశారు. రైతు గిడ్డయ్య గడ్డివాము పూర్తిగా కాలిపోవడంతో రూ.50 వేల ఆస్తినష్టం వాటిల్లింది.

వైద్య విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో విద్యార్థిని ఆత్మహత్యాయత్న ఘటనపై విచారణ కమిటీ ఏర్పాటు చేశామని ప్రిన్సిపాల్ డా.కే. చిట్టి నరసమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. 2022 బ్యాచ్ రెండో సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థి క్రిమిసంహారక మందు తాగిందని, ఈ ఘటనపై అటు వైపు పోలీసులు విచారణ కూడా జరుపుతున్నారని తెలిపారు. మరో వైపు కాలేజీలో కూడా ముగ్గురు ప్రొఫెసర్లతో ఇంటర్నల్ కమిటీ వేశామని చెప్పారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు.

నిధులు.. నీరు..!



హంద్రీ నీవా కాలువ

(5వ పేజీ తరువాయి)

సీమ ప్రాజెక్టులకు రూ.12,400 కోట్లు

● రాయలసీమ జిల్లాలకు సాగు, తాగునీరు అందించే హంద్రీనీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులకు రూ.12,400 కోట్లు నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు పంపారు. అందులో కర్నూలు, నంద్యాల జిల్లాలకు రూ.2,340 కోట్లు ప్రతిపాదించారు.

● కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా చేపట్టిన హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు 2025-26 బడ్జెట్‌లో రూ.3,500 కోట్లు కేటాయించాలని ఆ ప్రాజెక్టు అనంతపురం సీఈ నాగరాజు ప్రతిపాదన పంపారు. కర్నూలు జిల్లాలో విస్తరణకు రూ.690 కోట్లు అవసరం ఉంది.

● నంద్యాల, కడప, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో 2.60 ఎకరాలకు సాగునీరు అందించే గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.3,500 కోట్లు నిధులు అవసరం ఉందని ఆ ప్రాజెక్టు తిరుపతి సీఈ మల్లికార్జునరెడ్డి ప్రతిపాదనలు పంపారు. అందులో నంద్యాల జిల్లాలో పనులకు రూ.450 కోట్లు అవసరం ఉంది. కర్నూలు, కడప జిల్లాల్లో పెండింగ్ బిల్లులే రూ.1,900 కోట్లు చెల్లించాల్సి ఉంది.

● నంద్యాల, కడప జిల్లాల్లో 2.75 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టుకు రూ.5,400 కోట్లు బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని ఈ ప్రాజెక్టు కడప సీఈ శ్రీనివాసులు ప్రతిపాదనలు పంపారు. నంద్యాల జిల్లాలో పెండింగ్ బిల్లులే సుమారుగా రూ.1,200 కోట్లు చెల్లించాల్సి ఉంది.

● ఆ ప్రాజెక్టుల మాటేమిటి?

కరువు, వలసల నివారణే లక్ష్యంగా 2019కి మునుపు టీడీపీ ప్రభుత్వంలో ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని రూ.1,942 కోట్లతో వేదవతి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. రూ.90 కోట్లు ఖర్చు చేశారు. మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో 40 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని రూ.1,985.42 కోట్లతో ఆర్డీఎస్ కుడి కాలువ (రైట్ బ్యాంక్ కెనాల్) చేపట్టారు. 0.65 శాతం రూ.12.90 కోట్లు పనులు మాత్రమే చేశారు. వైసీపీ హయాంలో నిధుల లేమితో నిర్మాణాలు అటకెక్కాయి. టీడీపీ ప్రభుత్వం రాగానే పనులు మొదలు పెడుతామని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి ఎన్నికల ముందు స్పష్టమైన హామీ ఇచ్చారు. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టుపై ఆశలు చిగురించాయి. ఎనిమిది నెలలు దాటినా పనులు మొదలు పెట్టలేదు. రెండు ప్రాజెక్టులకు రూ.3,927.42 కోట్లు అవసరం ఉంది. పెరిగిన రేట్లు సరేసరి. 2025-26 బడ్జెట్‌లో టీబీపీ ఎల్లెల్సీతో కలిపి ఈ రెండు ప్రాజెక్టులకు రూ.250 కోట్లు ప్రతిపాదించారు. అందులో వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువకు రూ.200 కోట్లు మించదు. ఇప్పటికే రూ.14 కోట్లు బకాయి ఉంది. అంటే కావాల్సిన నిధుల్లో 5.09 శాతం కూడా ప్రతిపాదించలేదు. ఆ బడ్జెట్ కూడా ఇస్తారని నమ్మకం లేదు. అంటే ఈ ఏడాది వేదవతి, ఆర్డీఎస్‌లు పట్టాలెక్కడం ప్రశ్నార్థకమేనా..? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏటా 5-10 శాతం నిధులు కేటాయిస్తే వీటిని పూర్తి చేయడానికి ఎంత తక్కువ కాదన్నా 25 ఏళ్లు పడుతుందని నిపుణులు అంటున్నారు. బడ్జెట్ కేటాయింపులకు ఇంకా సమయం ఉండడంతో ఎమ్మిగనూరు, కోడుమూరు ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డిలు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులపై ఒత్తిడి తీసుకొచ్చి ఈ ప్రాజెక్టులకు రూ.1,000-1,500 కోట్లు కేటాయించి పనులు మొదలు పెట్టాలని రైతులు కోరుతున్నారు.

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రాజెక్టుల వారీగా 2025-26 బడ్జెట్ ప్రతిపాదనలు

ప్రాజెక్టు	ప్రతిపాదించిన బడ్జెట్(రూ.కోట్లల్లో)
శ్రీశైలం ప్రాజెక్టు	55
టీబీపీ ఎల్లెల్సీ, వేదవతి, ఆర్డీఎస్	250
కేసీ కెనాల్ కుందూ విస్తరణ	183
ఎస్సార్బీసీ కాలువ	40
రాజోలి, జొలదరాశి ప్రాజెక్టులు	40
గురురాఘవేంద్ర ప్రాజెక్టు	30
గాజులదిన్నె జలాశయం	28
68 చెరువుకుల నీటి ఎత్తిపోతలు	40
సిద్ధాపురం ఎత్తిపోతల పథకం	8
జీతాలు, ఇతర ఖర్చులు	250
మొత్తం	**924**
హంద్రీనీవా ప్రాజెక్టు	690
గాలేరు-నగరి ప్రాజెక్టు	450
ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు	1,200
మొత్తం	**3,264**

● గాజులదిన్నెకు ఇచ్చింది రూ.28 కోట్లు

కర్నూలు జిల్లాలో ఏకైక ప్రాజెక్టు గాజులదిన్నె జలాశయం. 4.5 టీఎంసీ నుంచి 5.50 టీఎంసీలకు సామర్థ్యం పెంపు, నూతన గేట్లు ఏర్పాటు పనులు, భూ సేకరణ కలిపి రూ.137 కోట్లతో చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం రూ.24 కోట్లు బిల్లులు బకాయి పెట్టింది. బకాయి చెల్లింపు, పనులు చేయాలంటే రూ.72 కోట్లు అవసరం ఉంది. ప్రతిపాదించింది మాత్రం రూ.28 కోట్లే.



మాట్లాడుతున్న మైసూరా రెడ్డి

కేఎంసీ కన్నతల్లితో సమానం

● ఇక్కడి నుంచే రాజకీయ ప్రస్థానం
● మాజీ మంత్రి డాక్టర్ ఎంవీ మైసూరారెడ్డి
● ఘనంగా పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశం

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కళాశాల (కేఎంసీ) కన్నతల్లితో సమానమని మాజీ మంత్రి డాక్టర్ ఎంవీ మైసూరా రెడ్డి అన్నారు. విద్యార్థి దశలోనే కర్నూలు మెడికల్ కాలేజీలో నాయకత్వ లక్షణాలను అలవర్చుకున్న తన రాజకీయ ప్రస్థానం మొదలైంది ఇక్కడే అన్నారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూలెక్చరర్ గ్యాలరీలో అల్యూమినీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కుమారస్వామి రెడ్డి అధ్యక్షతన కేఎంసీ పూర్వ విద్యార్థుల రెండు రోజుల వార్షిక సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎంవీ మైసూరా రెడ్డి మాట్లాడుతూ కర్నూలు మెడికల్ కాలేజీ తనకు తల్లి తర్వాత తల్లి లాంటిదని, తాను ఎక్కడికి పోయినా డాక్టర్ అని కేఎంసీలో చదువుకున్నట్లు గర్వంగా చెప్పుకుంటామన్నారు. 1966 బ్యాచ్‌కు చెందిన తాను కాలేజీలో విద్యను అభ్యసించానని, అప్పట్లో విద్యార్థి దశలో మూడో సంవత్సరం రెప్రజెంటీవ్‌గా హౌస్ సర్జన్ విభాగ ప్రధాన కార్యదర్శిగా పని చేశానన్నారు. రిటైర్డు డీజీపీ డాక్టర్ డీటీ నాయక్ మాట్లాడుతూ జిల్లా చారిత్రంగా, పౌరాణికంగా, సంస్కృతి పరంగా ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. డాక్టర్ నాగేశ్వరరెడ్డికి పద్మ విభూషణ్ అవార్డు రావడం గర్వకారణమన్నారు. అమెరికాలో స్థిరపడ్డ ప్రఖ్యాత గైనకాలజిస్టు పి.గురురాజా మాట్లాడుతూ కాలేజీ తనకు డిగ్రీతో మానవత్వం, ఆత్మస్థైర్యాన్ని ఇచ్చిందన్నారు. మంచి స్నేహితుల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నామన్నారు. స్నేహితుల వద్ద కష్టపడే తత్వాన్ని అలవర్చుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పి.శాంతికళ, కేఎంసీ ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, సీటీవీఎస్ సర్జన్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.చంద్రశేఖర్, డాక్టర్ విక్రమసింహారెడ్డి, ఎన్ఆర్ఐ సదాశివరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలమద్దయ్య, కోశాధికారి మహేశ్వరరెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్లు ప్రభాకర్ రెడ్డి, కె.వెంకటేశ్వర్లు, చిట్టి నరసమ్మ



హాజరైన కర్నూలు మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థులు

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

ఆస్పరి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తంగరడోన గ్రామంలో ముల్ల నానేసాహెబ్ అనుమానాస్పదంగా మృతి చెందినట్లు సీఐ మస్తాన్ వలి శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన మూల నానేసాహెబ్, చందు బాషా, మునుస్వామి కలిసి శుక్రవారం రాత్రి10 గంటల సమయంలో మద్యం సేవించారు. అక్కడి నుంచి మునిస్వామి తన ఇంటికి బయలుదేరాడు. చాంద్ బాషాఇంటిలోకి వెళ్లి తలుపులు వేసుకొని నిద్రించాడు. శనివారం తెల్లవారుజామున మూడు గంట సమయంలో చాంద్ బాషా బయటకు వచ్చి ముల్లా నానే సాహెబ్‌ను లేపినా లేవలేదు చుట్టుపక్కల వారిని పిలిచి చూడగా మృతి చెందినట్లు తెలిసింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆదోని ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ముల్లా ఖానుబీ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఖానుబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హంద్రీ నీవా కాలువలో బాలుడి మృతదేహం లభ్యం

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలం పందికోన గ్రామ సమీపాన ఈ నెల 13న హంద్రీనీవా కాలువలో ప్రమాదవశాత్తు పడి గల్లంతైన బాలుడు తులసి గౌడు (11) మృతదేహం శనివారం హంప దగ్గర హంద్రీనీవా కాలువలో మృతదేహం లభ్యమైంది. గత మూడు రోజులుగా పోలీసు, అగ్నిమాపక శాఖ సిబ్బంది గాలింపు చర్యలు చేసినా శనివారం హంద్రీ వద్ద బాలుడి మృతదేహం తేలియాడుతుండటంతో గాలింపు చర్యలు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది ప్రత్యేక బోటు ద్వారా బాలుడి మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు. మృతదేహాన్ని బయటకు తీసి పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. సీఐ జయన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స.హ చట్టం పేరుతో బ్లాక్ మెయిల్

● ఆసుపత్రి యజమాని నుండి రూ.50 లక్షలు డిమాండ్
● వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
● అరెస్టు చేసిన సీఐ శ్రీరాములు



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ శ్రీరాం

ఆదోని, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం ప్రజలకు వజ్రాయుధం లాంటిది. అలాంటి స.హ. చట్టాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారనడానికి ఈ ఘటన నిదర్శనం. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవలో అవకతవకలు జరిగాయని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలంటే రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసిన ఇద్దరు వ్యక్తులు కటకటాల పాలయ్యారు. ఈ సంఘటన ఆదోని పట్టణంలో శనివారం జరిగింది. పట్టణంలోని మధు ప్రైవేట్ ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య (ఆరోగ్యశ్రీ) సేవల్లో అవకతవకలు జరిగాయని, కలెక్టర్, సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని ఆదోని మండలం బసాపురం గ్రామానికి చెందిన కమ్మి ఏనుగుల రఘునాథ్, కమ్మి అడువేష్ ఆసుపత్రి యజమాని గురురెడ్డిని బెదిరించారు. కేసు వెనక్కి తీసుకోవాలంటే రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో గురురెడ్డి రూ.39 లక్షలు చెల్లించేలా అడ్వాన్స్ కింద రూ.5లక్షలు ఇచ్చేందుకు డీల్ కుదుర్చుకున్నారు. ఆదే రోజు ఆయన దగ్గర నుంచి బలవంతంగా రూ.10వేలు ఫోన్ పే ద్వారా తీసుకున్నారు. ఆసుపత్రి యజమాని గురురెడ్డి ఈనెల 11వ తేదిన తనను డబ్బుల కోసం బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాని స్టేబుళ్లు బాల భాస్కర్, మునిచంద్ర ఇంటి నోటీసులు ఇవ్వడానికి బసాపురం గ్రామానికి వెళ్లారు. అయితే నిందితులు వారిపై తిరగబడి దాడి చేశారు. కొత్త బ్రిడ్జి వద్ద వారిని అరెస్టు చేసినట్లు ఆదోని ఒకటో పట్టణ సీఐ శ్రీరాం తెలిపారు. వీరు చాలామందిని స.హ చట్టం ఆధారం చేసుకొని బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఆయన అన్నారు. వీరిపై ఇన్నీ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైందన్నారు.

వైసీపీ అసత్య ప్రచారాలను నమ్మకండి

మంత్రి సత్యకుమార్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సత్యప్రసాద్

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని మంత్రి సత్యకుమార్ అన్నారు. నంద్యాలలో బీజేపీ కార్యాలయానికి వచ్చిన ఆయన పార్టీ కార్యకర్తలను కలిశారు. కార్యకర్తలతో భారతీయ జనతా పార్టీ విజయాల గురించి చర్చించారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు బాగా అమలు చేస్తోందని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఈ రాష్ట్రానికి మంజూరైన ప్రతి మెడికల్ కాలేజి పూర్తవుతుందని తెలిపారు.

అధికారులు బాధ్యతగా పని చేయాలి

ఎమ్మెల్యే జయసూర్య



బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అధికారులు బాధ్యతగా పని చేయాలని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శనివారం జూపాడుబంగ్లా ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు సక్రమంగా పని చేయడం లేదని ప్రతిరోజూ ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మొత్తం 84 సమస్యలకు సంబంధించి ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. మండలంలోని తరిగోపుల గ్రామానికి చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ బాలస్వామి అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం చెక్కు అందజేశారు.

వేలం పాట వాయిదా

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని గాంధీచౌక్ ఏరియాలో వెలసిన కాళికాంబ చంద్రశేఖర స్వామి ఆలయ షాపుల బాడుగలకు నిర్వహించిన వేలం వాయిదా పడినట్లు ఆలయ ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. ఒక షాపు యజమాని కోర్టుకు వెళ్లారు. దీంతో మిగిలిన షాపులకు ఆలయ అధికారులు వేలం పాట నిర్వహించాలనుకున్నారు. మిగిలిన షాపులకు కూడా ఎవరు డిపాజిట్ కట్టకపోవడంతో వాయిదా వేశారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా గోపి, షాపుల యజమానులు, కాళిమాత సేవా సమాజం అధ్యక్షుడు ఆరవేటి వాసు, గురునాథం, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల-2 రకంపై దృష్టి సారించండి

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నంద్యాల-2 రకం పొగాకుపై దృష్టి సారించాలని ఐసీఏఆర్ కేంద్రీయ పొగాకు పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎం.శేషుమాధవ్ అన్నారు. ఆర్ఏఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొగాకును ఏడీఆర్ డాక్టర్ జాన్సన్, శాస్త్రవేత్తలు డాక్టర్ పుల్లిబాయ్, డాక్టర్ సతీష్‌బాబుతో కలిసి పరిశీలించారు. డాక్టర్ శేషుమాధవ్ మాట్లాడుతూ నంద్యాల పరిశోధనా స్థానం నుంచి విడుదలైన నంద్యాల-1 రకం మంచి దిగుబడినిచ్చిందని, ప్రస్తుతం నంద్యాల-2 రకం పొగాకు అత్యధిక దిగుబడినిస్తుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాల్లో పొగాకు సాగు గణనీయంగా పెరిగినందున శాస్త్రవేత్తలు తక్కువ కాలపరిమితి కల్గి అధిక దిగుబడినిచ్చే పొగాకు రకాలపైన పరిశోధనలు నిర్వహించాలని ఆదేశించారు.

కార్మికులను విధుల్లో చేర్చుకోవాలి

ఆత్మకూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో కరోనా సమయంలో పని చేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం అన్నారు. ఈ సందర్భంగా శనివారం సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడారు. ఆత్మకూరు పట్టణం విస్తరించడం వల్ల ప్రస్తుతం పని చేస్తున్న కార్మికులకు పని భారం అధికమైందని అన్నారు. ఈ నేపథ్యంలో అదనంగా కార్మికులను నియమించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. అయితే అదనపు సిబ్బంది నియామకం జరిగినట్లయితే కరోనా సమయంలో తాత్కాలిక సేవలందించిన కార్మికులకు ప్రాధాన్యత ఇస్తామని అప్పట్లో అధికారులు హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. ఇచ్చిన వాగ్దానం మేరకు కొత్తగా కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు రజాక్, రామ్‌నాయక్ ఉన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 18న నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి కోరారు. శనివారం జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ జాబ్ మేళాకు అరబిందో ఫార్మసీ, టాటా క్యాపిటల్, గ్రీటెక్ ఇండస్ట్రీస్, రేస్ డైరెక్ట్ సర్వీసెస్, నవత ట్రాన్స్‌పోర్ట్ తదితర పలు ప్రైవేట్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనుటకు 10వ తరగతి, ఇంటర్ డిగ్రీ, పీజీ బీటెక్ మెకానికల్, ఐటీఐ, డిప్లొమా అభ్యర్థులు అర్హులన్నారు. ఈ అకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విశిష్ట సంఖ్య ఆధారంగానే లబ్ధి

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు ఒక విశిష్ట సంఖ్య ఆధారంగానే ఇకపై లబ్ధి చేకూరుతుందని ఏవో స్వాతి అన్నారు. శనివారం మండలంలోని భోజనం, బండిఆత్మకూరు, సంతజూటూరు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమాలను ఏవో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు లతో ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు ఆయా గ్రామాల్లో ఆర్ఎస్‌కేలలో ఆధార్, పాస్‌బుక్‌లు చూపించి ఓ విశిష్ట సంఖ్యను పొందాలన్నారు. తద్వారానే ప్రభుత్వం పథకాలు అందిస్తామని తెలిపారు.

స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలి

● కలెక్టర్ రాజకుమారి ● గాజులపల్లెలో స్వచ్ఛాంధ్రపై అవగాహన



గాజులపల్లెలో చెత్తను తొలగిస్తున్న కలెక్టర్ రాజకుమారి



భూపనపాడులో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జేసీ విష్ణు చరణ్

మహానంది, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. శనివారం మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని పరిశుభ్రమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతూ దేశంలో అగ్రస్థానంలో నిలిపే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర- దివస్ కార్యక్రమం అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. ఈ క్రమంలోనే ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంను పటిష్టంగా అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి మురళీకృష్ణ, తహసీల్దార్ రమాదేవి, ఈవోఆర్డీ నాగేంద్రుడు, పంచాయితీ కార్యదర్శి నాగేంద్రుడు, టీడీపీ నాయకుడు కలర్స్ రవినాథరావులు పాల్గొన్నారు.

గాజులపల్లిలో డాబా నిర్వాహకులపై కలెక్టర్ సీరియస్

మహానంది మండలం గాజులపల్లెలోని పద్మశివ డాబాను కలెక్టర్ రాజకుమారి శనివారం తనిఖీ చేశారు. శనివారం గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ అనంతరం డాబాను పరిశీలించారు. ఇందులో భాగంగా పరిసరాల్లో ఉన్న అపరిశుభ్రతను చూసి అసహనం వ్యక్తం చేశారు. డాబా నిర్వాహకులకు రూ.లక్ష జరిమానా విధించాలని ఈవోఆర్డీ నాగేంద్రను ఆదేశించారు.

● ప్రమాదంలో గాయపడిన యువకులను కలెక్టర్ రాజకుమారి ఆసుపత్రిలో చేర్పించారు. శనివారం గాజులపల్లిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొని తిరిగి నంద్యాలకు వెళ్తుండగా మార్గమధ్యలోని బోయలకుంట్ల మెట్ట వద్ద బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో రాజు, హరిలు గాయపడ్డారు. అటువైపు వెళ్తున్న కలెక్టర్ ప్రమాదం జరిగిన ప్రదేశం గమనించారు. గాయపడిన యువకులను ప్రత్యేక వాహనం ద్వారా గాజులపల్లి పీహెచ్‌సీకి తరలించారు.

పాణ్యం: స్వచ్ఛాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టరు విష్ణు చరణ్ పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని భూపనపాడులో పర్యటించారు. ఈ సందర్భంగా చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ ప్రజలను కోరారు. తడి పొడి ప్రమాదకర వ్యర్థాలు విడి విడిగా వేరు చేయడం ముఖ్యమన్నారు. ప్రజలకు డస్ట్ బిన్‌లను పంపిణీ చేయాలన్నారు. అనంతరం మద్దూరులోని రైతులకు సంబంధించిన సూపర్ చెక్కులను పరిశీలించారు. రైతులు ఫార్మా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు నరేంద్రనాథరెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ జయప్రకాష్ రెడ్డి, ఈఓఆర్‌డీ చంద్రమౌళీశ్వరగౌడ్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

నంద్యాల రూరల్: నంద్యాల మండలంలోని అయ్యలూరు పంచాయతీ కార్యదర్శి నరేంద్రతోపాటు గ్రామంలోని సరస్వతి విద్యా మందిరం పాఠశాల నిర్వాహకులపై కలెక్టర్ రాజకుమారి సీరియస్ అయ్యారు. శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి మహానంది మండలం గాజులపల్లెకు వెళ్తున్న కలెక్టర్ అయ్యలూరు గ్రామంలో ఆగారు. ఈ సందర్భంగా పరిసరాల్లో ఉన్న చెత్త, మురికి నీరు గమనించారు. పంచాయతీ కార్యదర్శిని పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్త చెదారం ఇలాగే ఉంటే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. సమీపంలో ఉన్న సరస్వతి పాఠశాల పరిసరాల్లో సైతం చెత్త ఉండటంతో అక్కడ ఉన్న చెత్తను ఆమె స్వయంగా తొలగించారు. ఇలాగే చెత్త చెదారం ఉంచితే పాఠశాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కలెక్టర్ ఆగ్రహంతో పంచాయతీ కార్యదర్శి, ఇవోఆర్డీ, సచివాలయ సిబ్బంది, గ్రామ సర్పంచ్ ఓబులేసు హుటాహుటిన పరసరాల్లో చెత్తను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు.

పగిడ్యాల: స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పగిడ్యాలలో తడి, పొడి చెత్త సేకరణపై అధికారులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. స్వచ్ఛాంధ్ర -స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పగిడ్యాల ఎంపీడీవో సుమిత్రమ్మ, తహసీల్దార్ శివరాముడు ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శేషన్న, ఈవోఆర్డీ నాగేంద్రమయ్య, ఏపీవో మద్దిలేటి కార్యాలయ సిబ్బంది పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: పరిసరాల శుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ బేబి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులతో పరిసరాల పరిశుభ్రతపై మున్సిపల్ కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బేబి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటితోపాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చిన్న రాజు, టీడీపీ నాయకులు రమేష్, రజనీకాంత్‌రెడ్డి, మున్సిపల్ డీఈ నాసీర్, టీపీవో రంగస్వామి పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ అనే కార్యక్రమం జూపాడుబంగ్లాలో చేపట్టారు. ఎమ్మెల్యే పారిశుధ్య కార్మికులతో కలిసి చెత్తను ఊడ్చారు. ప్రభుత్వ కార్యాలయాలు, పరిసరాలు శుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశ్వర్లుయాదవ్, టీడీపీ నాయకులు గిరీశ్వరరెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు ఎంపీడీవో గోపికృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆత్మకూరు: పరిశుభ్రతతోనే ప్రగతి సాధ్యమని ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక అన్నారు. శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. అనంతరం కార్యాలయ ఉద్యోగుల తో కలిసి స్వచ్ఛ ఆంధ్ర సాధనకై ప్రతిజ్ఞ చేశా రు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు ఆంజినేయులు, మనోహర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సున్నిపెంట: శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు అధికారి కేవీ శివప్రసాద్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కార్యాలయం పరిధిలోని సిబ్బందితో కలిసి పారిశుధ్య పనులను చేపట్టారు. కార్యక్రమంలో ఏపీఓ సురేష్ కుమర్, డీఈ రియాజ్, ఏపీడీ కేజీ నాయక్, రామాంజినేయులు, నంద్యాల, ప్రకాశం జిల్లాలకు చెందిన చెంచు గిరిజన నాయకులు, ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల ఎడ్యుకేషన్: పర్యావరణాన్ని పరిరక్షించడంతోపాటు పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని నంద్యాల డీఐఈవో సునీత అన్నారు. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఐఈవో సునీత పాల్గొన్నారు. ముందుగా కళాశాల పరిసరాలను విద్యార్థులు శుభ్రం చేసిన అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

● ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదివస్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పిలుపునిచ్చారు. స్వచ్ఛదివస్ కార్యక్రమం సందర్భంగా ఎన్టీఆర్ షాదిఖానాలో నిర్వహించిన సమావేశంలో నంద్యాల బాలా అకాడమీ పాఠశాల విద్యార్థులు పాల్గొని స్వచ్ఛ దివస్ విశిష్టత గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అభినందించారు. .

మిడుతూరు: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో స్వచ్ఛ దివస్ కార్యక్రమం ఎంపీడీవో దశరథరామయ్య, మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుశేన్, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, వైద్య అధికారులు భరత్ కుమార్, శారద, గ్రామ సర్పచ్ జయలక్ష్మమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతంలోని చెత్తను, మురుగును తొలగించారు. కార్యక్ర మంలో హౌసింగ్ ఏఈ భాస్కర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు వరలక్ష్మి, రేణుకదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: ప్రతి ఒక్కరం స్వచ్ఛత కోసం పాటుపడదామని మండల స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రహెమాన్, ఎంపీడీవో దస్తగిరి, తహసీల్దార్ పద్మావతమ్మ, ఏఈ కంబగిరి అన్నారు. శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాల్లో ర్యాలీలు, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చెత్త, మురుగు తొలగించారు.

కొత్తపల్లి: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరీ, సర్పంచ్ లక్ష్మీదేవిలు అన్నారు. శనివారం కొత్తపల్లి, దుద్యాల గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పాములపాడు: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి రాజు అన్నారు. శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పాములపాడులోని ఎంపీడీవో కార్యాలయం, ఏపీవో కార్యాలయం, అంగన్‌వాడీ పాఠశాల పరిసరాలలో అధికారులతో కలిసి ఆయన పరిశుభ్రత చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఏపీవో విమలమ్మ, పంచాయతీ కార్యదర్శి నాగశేషులు, సిబ్బంది ఉన్నారు.



నందికొట్కూరులో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ బేబి

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సుబ్రమణ్యం అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందని అన్నారు. ఈ నేపథ్యంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికాకారులతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు సమన్వయమై ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ఇందిరేశ్వరం చెరువుకు రస్తా సమస్యను, కురుకుంద చెరువు తూములకు లాక్‌లను అమర్చాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ఉపాధి హామీ పథకంలో భాగంగా కొత్తగా జాబ్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని ఏపీవో నాగమ్మ వివరించారు. రుద్రకోడూరుకు వెళ్లే భక్తుల నుంచి అటవీశాఖ డబ్బులు వసూళ్లు చేయవద్దని పలువురు సభ దృష్టికి తీసుకురాగా ఉన్నతాధికారుల ప్రొసిండింగ్స్ మేరకే వసూళ్లు చేస్తున్నామని అటవీ అధికారులు సమాధానమిచ్చారు. అలాగే బైర్లూటిలో గిరిజన రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకై అటవీ స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్ రత్నరాధిక ప్రస్తావించగా భూకేటాయింపులు తమ పరిధిలో లేవని, ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్‌ను సంప్రదించాలని వారు తెలిపారు. అదేవిధంగా ఆయా శాఖల అధికారులు కూడా తమ శాఖ ప్రగతి నివేదికలను వివరించారు. ఈ సమావేశానికి ఎంపీపీ తిరుపాలమ్మ, జడ్పీటీసీ శంకరరెడ్డి, ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి, ఏపీఎం ఉమారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పక్కీరయ్య, ఎంఈవో సురేష్, ఉద్యాన శాఖ అధికారి చందన్న తదితరులు ఉన్నారు. ఇదిలావుంటే ఉదయం 11గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే 11.15 గంటలైనా ఒకరిద్దరు అధికారులు, ప్రజాప్రతినిధులు తప్ప మిగతా వారెవరు హాజరు కాకపోవడం విమర్శలకు తావిస్తోంది.



ఇందిరేశ్వరం చెరువు సమస్యను అధికారులకు వివరిస్తున్న సర్పంచ్ రామచంద్రారెడ్డి

ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల మున్సిపాలిటీ ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మంత్రి ఎన్ఎండీ ఫరూక్ శనివారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు వివిధ సమస్యలతో కూడిన విజ్ఞాపన పత్రాలు మంత్రికి ఇచ్చారు. పలు విజ్ఞాపనలు పరిశీలించిన మంత్రి సత్వరమే పరిష్కారమయ్యే సమస్యల గురించి ఆయా శాఖల అధికారులకు ఫోన్ చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

డ్రైవర్ల చేతుల్లో ప్రయాణికుల ప్రాణాలు

ఏఎస్పీ యుగంధర్ బాబు



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న పోలీసులు

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల ప్రాణాలు డ్రైవర్ల చేతిలో ఉంటాయని అదనపు ఎస్పీ బి.చంద్రబాబు నాయుడు అన్నారు. నంద్యాల ఆర్టీసీ డిపోలో శనివారం రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని అన్నారు. ఆర్టీసీ ప్రతి ఆరు నెలలకోసారి సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని అధికారులను కోరారు. మార్చి నుంచి నంద్యాల ట్రాఫిక్ కూడల్లో ఆటోమేటిక్ రెడ్ లైట్ వయోలేషన్ డిటెక్షన్ సిస్టం అమల్లోకి వస్తుందని తెలిపారు. వాహనదారులు రెడ్‌లైట్ పడినా ముందుకు వెళితే ఆటోమేటిక్ డిటెక్షన్ సిస్టం గుర్తించి ఈ చలాన్ వేస్తుందని అన్నారు. అనంతరం జిల్లాలోని ఏడు డిపోలకు చెందిన 24 మంది ప్రమాద రహిత డ్రైవింగ్ చేసిన ఉత్తమ డ్రైవర్లను బహుమతితో సన్మానించారు కార్యక్రమంలో డీపీటీవో రజియా సుల్తానా, ఆర్టీఓ ఐశ్వర్యా రెడ్డి, ఎంవీఐ జి. శ్రీకాంత్, డిపో మేనేజర్ గంగాధర్, ఇన్‌చార్జి అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు 97 శాతం పంపిణీ

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో 1-19 సంవత్సరాలలోపు విద్యార్థులకు 97శాతం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. జిల్లా వ్యాప్తంగా 1597 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, 1099 ప్రైవేట్ పాఠశాలలు, 211 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, 1663 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 4,29,268 మంది విద్యార్థులకు గాను 4, 17, 341 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామని వివరించారు. మిగిలిన విద్యార్థులకు ఈనెల 17వ తేదీన మాప్ అప్‌రౌండ్ ద్వారా పంపిణీ చేస్తామన్నారు. నులిపురుగుల నివారణ మాత్రలను వేసుకోవడం ద్వారా కడుపులో ఉండే నులిపురుగులు నశిస్తాయన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం రంగారెడ్డి జిల్లాకు చెందిన బోరెడ్డి మల్లికార్జునరెడ్డి అనే భక్తుడు రూ. 1,00,541 విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

● బెంగళూరుకు చెందిన లాస్యం స్కూల్ ఆఫ్ కూచిపూడి వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. శ్రీలాస్య, హారిక, తేజస్విని తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు. తరువాతి కార్యక్రమంలో పల్నాడు జిల్లా, నరసరావుపేటకు చెందిన రాధావాలు దేవ్, ఎంఎస్ఎన్ కళాక్షేత్రం వారిచే గణపతి ప్రార్థన, శివోహం, మార్కండేయ చరితం, శివ శివ శంకరా తదితర గీతాలకు వర్షిణి, కీర్తిక, చైత్ర, శర్వాణి తదితరులు సంప్రదాయ నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

హెల్త్ సెంటర్ కోసం భూ పరిశీలన

కొత్తపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని శివపురం చెంచుగూడెంలో హెల్త్‌సెంటర్ నిర్మాణం చేపట్టేందుకు భూ పరిశీలన చేస్తున్నట్లు ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి తెలిపారు. శనివారం ఆమె కొత్తపల్లి తహసీల్దార్ ఉమారాణి, డీటీ పెద్దన్నతో కలిసి హెల్త్ సెంటర్ నిర్మాణం కోసం భూ పరిశీలన చేశారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ శివపురం గూడెంలోని చెంచుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం సీసీడీపీ గ్రాంట్ కింద రూ.55 లక్షల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇందులో భాగంగా వీటి నిర్మాణం కోసం పది సెంట్ల భూమి రెవెన్యూ శాఖ ద్వారా సమకూర్చాల్సి ఉందన్నారు. గూడెం శివారులో ఉన్న భూమి ఏ శాఖకు సంబంధించినదో పరిశీలించి తుది నివేదిక ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్టమైన నిఘా

ఆత్మకూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకై పటిష్టమైన నిఘా ఉంచుతున్నట్లు అర్బన్ ఇన్‌స్పెక్టర్ డి.రాము అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆత్మకూరు పట్టణంలోని ఆయా ప్రధాన ఏరియాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పని తీరును ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పట్టణంలోని గౌడ్‌సెంటర్, ఆర్టీసీ బస్టాండ్, నంద్యాల టర్నింగ్, సంగమేశ్వరం సర్కిల్, పాతబస్టాండ్, కిషన్‌సింగ్ వీధి, చరకా కాలనీ, ఫారెస్ట్ చెక్‌పోస్టు, సాయిబాబా ఆలయం, అమ్మవారిశాల, వెంకళరెడ్డినగర్, కస్తూర్బాగాంధీ స్కూల్, జగనన్న కాలనీ, నల్లకాల్వ, స్మృతివనం తదితర ఏరియాల్లో సుమారు 80 కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి కమాండ్ కంట్రోల్‌ను పోలీసుస్టేషన్ కేంద్రంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నట్లు వెల్లడించారు.

అంకాలమ్మ గూడెం చెంచులను ఆదుకోవాలి

సున్నిపెంట, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా రుద్రవరం మండలం పరిధిలోని అంకాలమ్మ గూడెం చెంచులను ప్రభుత్వం ఆదుకోవాలని కోమరంభీమ్ ఆదివాసి చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు వై. ఆశీర్వాదం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అకాలమ్మ చెంచు గూడంలో దాదాపుగా 30 కుటుంబాల చెంచు గిరిజనులు 70 సంవత్సరాలుగా జీవిస్తున్నారు. వీరు వ్యవసాయం చేసేందుకు ప్రభుత్వం పొలాలు మంజూరు చేయకపోవడంతో జీవనోపాధి కోసం వలస పోతున్నారని అన్నారు. ఇప్పటికైనా అకాలమ్మ చెంచు గూడెం గిరిజనులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

● తమిళనాడు రాష్ట్రంలో దళిత యువకుడి చేతులు నరికిన దుండగులను కఠినంగా శిక్షించాలని శ్రీశైలం మండలం దళిత గిరిజన సంక్షేమ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం నాయకులు మాట్లాడుతూ దలితులపై దాడులు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని కోరారు.

పోలీసు క్రికెట్ విజేత నంద్యాల డివిజన్

పాణ్యం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు క్రీడల్లో భాగంగా శనివారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో నంద్యాల డివిజన్ విజేతగా నిలిచింది. ఈ క్రీడలను ఏఆర్ ఏఎస్పీ చంద్రబాబు, ఏఆర్ డీఎస్పీ రాజసింహ ప్రారంభించారు. క్రీడల్లో నంద్యాల, ఆత్మకూరు, డోన్, నంద్యాల డివిజన్‌లకు చెందిన పోలీసు క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్‌లో నంద్యాల, ఆత్మకూరు డివిజన్‌ల మధ్య జరిగిన పోటీలో ఆత్మకూరు డివిజన్ పది ఓవర్లలో 70 పరుగులు చేయగా నంద్యాల జట్టు నాలుగు వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసి జిల్లా స్థాయి విజేతగా నిలిచినట్లు డీఎస్పీ చాంద్‌బాషా తెలిపారు.

పరీక్షల భయం వీడాలి: డీఈవో


ప్రీ ఫైనల్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

శిరివెళ్ల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : పరీక్షల భయం విద్యార్థులు వీడాలని డీఈవో జనార్దన్‌రెడ్డి సూచించారు. శిరివెళ్లలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, వీరారెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రీ ఫైనల్ పరీక్షలను డీఈవో పర్యవేక్షించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు సలహాలు, సూచనలు అందజేశారు. విద్యార్థులు ఒత్తిడికి లోనవ్వకుండా సరైన ప్రణాళికతో చదివితే ఉత్తమ మార్కులు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో డీటీ శంకర్ ప్రసాద్, ఎస్‌వో జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

చాగలమర్రి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ముస్తక్‌అహ్మద్ అన్నారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని 2వ సచివాలయాన్ని తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్ ఉన్నారు.

అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు: డీఆర్వో

బేతంచెర్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అడవికి నిప్పు పెట్టడంతో మానవాళికి ముప్పు కలుగుతుందని బనగానపల్లె డీఆర్వో సుబ్బయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని అంబాపురం, గోర్లగుట్ట గ్రామాల్లో అడవుల సంరక్షణ కార్యక్రమం రేంజర్ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో రంగాపురం బీట్ ఆఫీసర్ జయమ్మ, అవుకు బీట్ ఆఫీసర్ సురేంద్ర నాయుడు, ఎర్రగుడి బీట్ ఆఫీసర్ శంకర్ నాయక్, జీఏ బాద్ బీట్ ఆఫీసర్ సహాన్‌షావలి ప్రజలు పాల్గొన్నారు

ప్రమాద రహిత డ్రైవర్లకు పారితోషికం

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ డిపో పరిధిలో నిర్వహించే రోడ్డుభద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా డిపోకు చెందిన ముగ్గురు ప్రమాద రహిత డ్రైవర్లకు నంద్యాల జిల్లా ప్రజారవాణా అధికారి రజియాసుల్తానా పారితోషికం ఇచ్చిందని కోవెలకుంట్ల డిపో మేనేజరు తిరుపతయ్య తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిపోలో మొదటిప్రమాద రహితడ్రైవరుగా జి. చిన్నన్న వెయ్యి నగదు, రెండో ప్రమాద రహిత డ్రైవరు కేవీ ప్రతాప్‌రెడ్డి రూ.750 నగదు, మూడో ప్రమాద రహిత డ్రైవరుగా మద్దిలేటి రూ.500లను అందుకున్నారన్నారు.

జీవనోపాధులను మెరుగుపరచుకోవాలి: పీడీ

బనగానపల్లె, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలు తీసుకున్న స్త్రీ నిధి, పొదుపు రుణాలు సకాలంలో చెల్లించి జీవనోపాధులను మెరుగు పరచుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలతో మండల సమాఖ్య కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ సెర్ప్ స్త్రీనిధి ఎండీ హరిప్రసాద్, ఏపీఎం శ్రీనివాసులు, సమాఖ్య లీడర్లు పక్కూర్‌బీ, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

● యాగంటి క్షేత్రాన్ని పీడీ శ్రీధర్‌రెడ్డి, ఏపీ సెర్ప్ స్త్రీనిధి ఎండీ హరిప్రసాద్, వెలుగు ఏపీఓ శ్రీనివాసులు శనివారం దర్శించుకున్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

డోన్ టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ముద్రణ రుణాలు, పంట రుణాలతో పాటు ఇతర రుణాలను తీసుకున్న వారు సకాలంలో రుణాలు చెల్లించాలని యూనియన్ బ్యాంకు మేనేజర్ రాజేష్ అన్నారు. శనివారం స్థానిక యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌లో ఖాతాదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు సురేష్, గోవిందరాజు, భాస్కర్, శ్రీనివాసులు, మోహన్, సాగర్ పాల్గొన్నారు.

నారసింహుడికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో శనివారం నారసింహుడుకు ప్రత్యేక పూజలు చేశారు. పార్వేట పల్లకీలో కొలువుదీరిన జ్వాలా లక్ష్మీనరసింహస్వామి, ప్రహ్లాద వరదస్వాములకు స్థానిక ప్రజలు భారీసంఖ్యలో తరలివచ్చి పూలమాలలు, కాయ కర్పూరం సమర్పించారు. తెలుపు తెలుపు మీద ప్రత్యేక పూజలందుకున్నారు. శనివారం సాయంత్రం పార్వేట ఉత్సవ పల్లకీ చందలూరు గ్రామం చేరుకుంది.

పాడిపరిశ్రమ అభివృద్ధికి కృషి

శిరివెళ్ల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : పాడిపరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుంప్రమాన్‌దిన్నె, రాజనగరం గ్రామాల్లో నిర్మించిన మినీ గోకులం షెడ్డులను ఆయన శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుందూరు మోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, భరత్‌రెడ్డి, జవహర్‌రెడ్డి, మురళి పాల్గొన్నారు.

నందవరం ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం

బనగానపల్లె, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీ మాత ఆలయాభివృద్ధికి నంద్యాలకు చెందిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ శ్రీవిద్య కుటుంబీకులు శనివారం రూ.లక్ష విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ పీవీ. కుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.

● టంగుటూరు పెద్దమ్మ ఆలయాభివృద్ధికి గోస్పాడు మండలం రాయపాడుకు చెదిన పెద్దవెంకటసుబ్బారెడ్డి, చిన్న వెంకటసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు శనివారం రూ.50వేలు ఆలయ చైర్మన్ రామగంగిరెడ్డి విరాళం అందించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోరుమానుపల్లె గ్రామంలో వెలసిన పురాతన బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం ధ్వజస్తంభం, శిఖర ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. 17న ధ్వజస్తంభం, విగ్రహం ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ఆలయ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వేలంలో రూ.11.65 లక్షల ఆదాయం

బనగానపల్లె, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీ మాత ఆలయంలో మరుగుదొడ్ల నిర్వహణకు నిర్వహించిన వేలం ద్వారా రూ.11.65లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో చంద్రుడు శనివారం తెలిపారు. పాతపాడుకు చెందిన మధుసుధాకర్ వేలం దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, మౌళీశ్వర రెడ్డి, ఆలయ అర్చకులు మహేశ్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సీసంగుంతలలో మేలు జాతి దూడల ప్రదర్శన

డోన్ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీసంగుంతల గ్రామంలో శనివారం మేలుజాతి దూడల ప్రదర్శన కార్యక్రమం రాష్ట్ర గోకుల్ మిషన్ పథకం కింద నిర్వహించారు. పశుసంవర్థక శాఖ ఉమ్మడి జిల్లా కార్యనిర్వహణాధికారి డాక్టర్ రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం దూడలకు నట్టల నివారణ మందులను తాపించారు. కార్యక్రమంలో డీడీ శ్రీనివాసులు, డోన్ పశువైద్యశాల ఏడీ నాగరాజు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీహెచ్‌ఎస్‌లో క్లస్టర్ సమావేశం

డోన్ టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పాతపేట జడ్పీహెచ్‌ఎస్‌లో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాన్ని హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి ఆధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 రామ్ నరసప్ప, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ భయం!





● తగ్గిన చికెన్ ధరలు
● వెలవెలబోతున్న దుకాణాలు
● బోరుమంటున్న వ్యాపారులు


చాగలమర్రిలో వెలవెలబోయిన చికెన్ షాప్

చాగలమర్రి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో బర్డ్‌ఫ్లూ ప్రచారం జోరందుకుంది. గతంలో నిత్యం రెస్టారెంట్లు, చికెన్ స్టాల్స్ దుకాణాలు విక్రయాలతో కళకళలాడేవి. నేడు ఆ పరిస్థితి లేదు. ప్రజల్లో భయాందోళన పెరిగిపోయింది. ఈ క్రమంలో చికెన్ వైపు చూడాలంటే ససేమిరా అంటూ భయపడుతున్నారు. అయితే దుకాణదారులు వ్యాపారాలు లేక ఇంటి అద్దెలు, మెడికల్, ఈఎంఐలతో సతమతమవుతున్నారు. గతంలో కోవిడ్ సమయంలో ఎందరో వ్యాపారులు కనుమరుగయ్యారు. ఇప్పుడిప్పుడే అన్ని సర్దుకున్నాయి. తాజాగా బర్డ్‌ఫ్లూ కలకలం రేపుతుండటంతో బతుకు జీవుడా అంటు న్నారు. ఒక్కొక్క చిన్న చికెన్ షాపులో గతంలో 70నుంచి 100 కేజీల చికెన్ విక్రయాలు జరిగేవి. అప్పట్లో ధర రూ.280 నుంచి రూ.300 వరకు ఉంది. కానీ ప్రస్తుతం ధర రూ.180 నుంచి రూ.140 ఉండగా 10 నుంచి 15 కేజీలు విక్రయాలు జరపడం గగనంగా మారింది. మరో వైపు అధికారులు నంద్యాల జిల్లాకు బర్డ్‌ఫ్లూ వల్ల ప్రస్తుతం ఇబ్బంది లేదని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. ప్రజల్లో ఆందోళన నెలకొనడంతో వ్యాపారాలు వెలవెలబోతున్నాయి.

● గుడ్డా.. బ్యాడా

గుడ్డ తినడం మంచి దా, కాదా ఇప్పుడు ఇదే చర్చ నడుస్తోంది. కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ వచ్చిన ప్రాంతాల పరిధి లోని పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లు ఇవ్వరాదని విద్యాశాఖ స్పష్టం చేసింది. అయితే నంద్యాల జిల్లా ప్రాంతంలోని పాఠశాలలకు గుడ్లు ఇవ్వాలని, ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో కోడి గుడ్లు తప్పనిసరిగా ఇవ్వాలని, యథావిధిగా వాడాల ని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు.

మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లు ఇస్తున్నాం



మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లు ఇవ్వాలని, ఎలాంటి ఇబ్బంది లేదని విద్యాశాఖ స్పష్టం చేసింది. పాఠశాలల్లో ఐదు రోజుల పాటు కోడిగుడ్లు ఇస్తున్నాం. పాఠశాలల్లో విద్యార్థులు బర్డ్‌ఫ్లూ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– న్యామతుల్ల, ఎంఈవో, చాగలమర్రి



ఆందోళన అవసరం లేదు



బర్డ్‌ఫ్లూ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆరు మండలాల్లో ముందస్తుగా టీమ్‌లు ఏర్పాటు చేశాం. ఎలాంటి సమాచారం వచ్చిన తగిన చర్యలు తీసుకుంటాం. చికెన్, గుడ్లను తినవచ్చు.

– వరప్రసాద్, ఏడీ, పశువైద్యశాఖ, చాగలమర్రి

చికెన్ వ్యాపారం లేక ఇబ్బందులు



చికెన్ వ్యాపారాన్నె నమ్ముకొని జీవనం సాగిస్తున్నా. బర్డ్‌ఫ్లూ ప్రచారంతో విక్రయాలు తగ్గాయి. గతంలో చికెన్ వ్యాపారం 40 కేజీల నుంచి 50 కేజీల దాకా వ్యాపారం ఉండేది. ప్రస్తుతం 10 కేజీలు కూడా అమ్ముకోలేకపోతున్నా. ధర అమాంతంగా పడిపో యింది. వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్నాం.

– చాంద్‌బాషా, వ్యాపారి, చాగలమర్రి

అప్పులతో వ్యాపారాలు చేస్తున్నాం



ఇప్పటికే అప్పులు తెచ్చి వ్యాపారాలు చేస్తున్నా. షాపు అద్దె కట్టా లి. రోజుకు 100 కేజీల దాకా చికెన్ వ్యాపారం జరుగుతుండేది. ఇప్పుడు 20నుంచి 30 కేజీలు మాత్రమే పోతోంది. ఈ క్రమంలో వ్యాపారాలు తగ్గడంతో జీవనం అయోమయంగా మారింది.

– మహబూబ్‌బాషా, వ్యాపారి, చాగలమర్రి

సమస్యలు గుర్తించి పరిష్కరించడమే ధ్యేయం

– ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. పట్టణంలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద శనివారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను ఎమ్మెల్యే స్వీకరించారు. వైసీపీ హయాంలో కేటాయించిన 1,392 టిడ్కో గృహాల్లో నిజమైన లబ్ధిదారులకంటే అనర్హులు ఎక్కువగా ఉన్నారని.. వీటికి సంబంధించిన వివరాలు అందజేయాలని ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా టిడ్కో గృహ సముదాయాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రహరీ నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, కౌన్సిలర్ హుసేన్ బాషా, టీడీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

నిర్లక్ష్యం చేయొద్దు : కోట్ల

ప్యాపిలి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంత భవనంలో ఆయన ప్రజాసమస్యలపై వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని కలచట్ల, పెద్దపూదిళ్ల, పోతుదొడ్డి, మాందొడ్డి, గుడిపాడు తదితర గ్రామాల ప్రజలు భూసమస్యలు, తాగునీటి ఎద్దడి, శ్మశానాల కొరత వంటి వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతులు అందజేశారు. అనంతరం కోట్ల మాట్లాడుతూ ప్రధానంగా వేసవి ప్రారంభమైనందున గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏఈ ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దారు భారతి, ఈవోఆర్డీ బాలక్రిష్టుడు, ఏపీవో రమణ పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


ప్యాపిలిలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

అంగన్‌వాడీల వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

డోన్ రూరల్: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జులైఖ డిమాండ్ చేశారు. శనివారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి ఏస్తరమ్మ, మండల కార్యదర్శి స్వర్ణలత ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బనగానపల్లె, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మన చుట్టు ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీవో సుబ్బారెడ్డి సూచించారు. శనివారం బనగానపల్లె గ్రామ పంచాయతీ ఈవో సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎల్‌పీవో సుబ్బారెడ్డి పాల్గొని పలు వీధుల్లో పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. అనంతరం పెట్రోల్‌బంకు కూడలిలో విద్యార్థులతో, అధికారులతో కలసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బురానుద్దీన్, ఎంపీడీవో రమణ, వెలుగు ఏపీఎం శ్రీనివాసులు, తహసీల్దారు నారాయణరెడ్డి, ఆర్‌డబ్ల్యు ఎస్ డీఈ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్ చేట్టారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల స్వచ్ఛ ఆంధ్ర సమన్వయ కర్త కౌసల్యాదేవి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మహమ్మద్ గౌస్, అధ్యాపకులు సూర్యానారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, బడేసాహెబ్ రామకృష్ణ, నీతమ్మ, నాగరాజారెడ్డి, వరలక్ష్మి, రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.


బనగానపల్లె పట్టణంలో పెట్రోల్ బంకు కూడలిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎల్‌పీవో సుబ్బారెడ్డి

డోన్ రూరల్: మండలంలోని ఉడుములపాడు గ్రామంలో స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సచివాలయ పరిసరాలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం స్పెషల్ ఆఫీసర్ రఘురాం, సర్పంచ్ రాధమ్మ, సచివాలయ కార్యదర్శి మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

శిరివెళ్ల : స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా శిరివెళ్లలోని సచివాలయం-1 నుంచి గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివ మల్లేశ్వప్ప, తహసీల్దార్ పుష్ప కుమారి, ఈవోపీఆర్డీ శ్రీనివాస శర్మ, డిప్యూటీ డీఈవో శంకర్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి అశ్విన్ కుమార్, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, టీడీపీ నాయకులు బాల చంద్రుడు, రవి, యూనుస్ పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలో సర్పంచ్ తులశమ్మ ఆధ్వర్యంలో తడిచెత్త, పొడిచెత్త, పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంతమార్కెట్ ఆవరణలో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ముస్తాక్ అహ్మద్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, ఏవో రంగనేతాజీ, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, ఆర్ఐ , సిబ్బంది పాల్గొన్నారు.


బేతంచెర్లలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

కొలిమిగుండ్ల : మండలంలోని కోటపాడు గ్రామంలో పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. టీడీపీ మండల ప్రచార కార్యదర్శి శివరామిరెడ్డి, టీడీపీ నాయకులు మూల శివారెడ్డి, సీతారామిరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి అమరావతి సమక్షంలో ఇంటింటికీ తిరిగి చెత్త బుట్టలు పంపిణీ చేశారు.

కోవెలకుంట్ల : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ సర్కిల్‌లో మానవ హారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు పవన్ కుమార్‌రెడ్డి, సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: స్వచ్ఛదివాస్ కార్యక్రమాన్ని ఎంపీడీవో సావిత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం, సచివాలయాలు, పోలీసు స్టేషన్, అంగన్‌వాడీ కేంద్రాలు పరిశుభ్రత పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఐ హనుమంతరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ, ఏపీవో గంగన్న, పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు, గ్రామపంచాయితీ కార్యాలయం ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ బాలక్రిష్ణ, ఏఈ ప్రభాకర్‌రెడ్డి, ఏపీవో రమణ, పంచాయితీ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల : బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సబ్ రిజిస్ట్రార్ ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మద్దిలేటి స్వామి క్షేత్రంలో ఏవో రామాంజనేయులు ఆధ్వర్యంలో దేవస్థాన సిబ్బంది, అధికారులు పరిసరాలను పరిశుభ్రం చేశారు.

డోన్ టౌన్: పట్టణంలోని గుత్తిరోడ్డులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌కార్యక్రమం సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే కనపకుంటలో గ్రామ సర్పంచ్ కళ్యాణి , పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

24 నుంచి ఉచిత నైపుణ్య శిక్షణ

డోన్ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 24నుంచి ఉచిత నైపుణ్య శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌లో భాగంగా డేటా ఎంట్రీ ఆపరేటర్, కన్‌స్ట్రక్షన్ ఎలక్ట్రికల్ కోర్సులకు సంబంధించి అర్హులైన అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాల కోసం ఐటీఐ కళాశాలలో సంప్రదించాలన్నారు.

సంబరాల పేరుతో వసూళ్లు తగదు

డోన్ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు పాఠశాలల వార్షికోత్సవం పేరుతో విద్యార్థుల నుంచి డబ్బులు వసూళ్లు చేయడం తగదని ఎస్ ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయకుమార్ అన్నారు. శనివారం డోన్ డిప్యూటీ విద్యాధికారి కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో అబ్దుల్‌కలాం

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాలు పెంచడానికి కృషి చేయాలని మండల విద్యాధికారి అబ్దుల్‌కలాం అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశాలు నిర్వహించి, బోధనపై దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం క్లస్టర్ సమావేశాలను ఎంతో ప్రాధాన్యతతో నిర్వహిస్తోందని ఎంఈవో అన్నారు. విద్యార్థికి నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను బోధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ సంజీవరెడ్డి, హైస్కూల్ హెచ్ఎం హుసేనయ్య, రీసోర్స్ పర్సన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహం ప్రతిష్ఠ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతకుంట్ల గ్రామంలో చెరువుగట్టు మహాగణపతి, పరమే శ్వర, ఆంజనేయ సమేత శనైశ్చర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పాణ్యం దక్షిణామూర్తి ఆధ్వర్యంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, వేద మంత్రోచ్ఛరణాలతో ప్రతిష్ఠ నిర్వహించారు. శ్రీ రాఘవేంద్ర పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థుల సహకారంతో ఈ ఆలయ నిర్మాణం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

18న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

చాగలమర్రి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో కొత్తగా వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ దినోత్సవం సందర్భంగా 18న వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

చేతి పంపులకు మరమ్మతులు

చాగలమర్రి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పని చేయని చేతి పంపులకు మరమ్మతులు చేయిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ క్రాస్ ప్రోగ్రామ్ కింద ప్రతి చేతిపంపు పని చేసేలా చూస్తున్నామన్నారు. రూ.5.60లక్షలతో పరికరాల కొనుగోలుకు ప్రతిపాదనలు చేశామన్నారు.

బోధన నైపుణ్యాలను పెంచేందుకే కాంప్లెక్స్

చాగలమర్రి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యాబోధన వ్యవస్థను బలోపేతం చేసేందుకే ప్రభుత్వం క్లస్టర్ కాంప్లెక్స్ వ్యవస్థను ప్రవేశ పెట్టిందని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల తెలిపారు. శనివారం మండలంలోని పెద్దబోదనం, చింతలచెరువు, చాగలమర్రి గ్రామాల్లోని బాలుర ఉన్నత పాఠశాలల్లో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు.

టీడీపీ గ్రామ కన్వీనర్ మృతి

చాగలమర్రి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ కన్వీనర్ అమీర్ (60) శనివారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందాడు.ఆయన మృతిపై టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, బీసీ సెల్ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు మౌళాలి, అనిఫ్, జెట్టి నాగరాజు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం ప్రకటించారు.